

సంస్కరణ దినం · 31 అక్టోబర్ 2026

“నా మనస్సాక్షి దేవుని వాక్యానికి బందీ”

Captive to the Word of God

లూథర్ మాట… నేటి సంఘానికి పిలుపు

Pastor John Prabhu Kiran

ఒక సుత్తి, ఒక మేకు, ఒక చర్చి తలుపు — 1517 అక్టోబరు 31న జరిగిన ఈ చిన్న సంఘటన... క్రైస్తవ చరిత్రనే మార్చింది.

జర్మనీలోని విట్టెన్‌బర్గ్ పట్టణం. మార్టిన్ లూథర్ అనే ఒక సన్యాసి — ఆ ఊరి విశ్వవిద్యాలయంలో వేదాంత ఆచార్యుడు. అతడు తన 95 వాదాంశాలను అక్కడి చర్చి తలుపుకు మేకుతో కొట్టాడు.

అది ఒక చిన్న కాగితమే. కానీ ఆ మేకు దెబ్బ యూరప్ అంతా ప్రతిధ్వనించింది. దానినే మనం "సంస్కరణ" అంటాం. అందుకే ప్రతి సంవత్సరం అక్టోబరు 31ని లోకమంతటా ఉన్న ప్రొటెస్టెంట్ సంఘాలు "సంస్కరణ దినం"గా జ్ఞాపకం చేసుకుంటాయి.

కానీ ఈ రోజు నా మనస్సులో ఒక ప్రశ్న మెదులుతోంది. ఐదు శతాబ్దాల క్రితం లూథర్ ఎదిరించిన జబ్బులు... ఈ రోజు మన సంఘాల్లోకి మళ్ళీ చొరబడ్డాయా? మన సంఘాలకు కూడా అలాంటి ఒక తలుపు, అలాంటి ఒక మేకు అవసరమా?

చరిత్రను గుర్తు చేసుకోవడం మంచిదే. కానీ చరిత్ర నుండి నేర్చుకోకపోతే... అదే చరిత్ర మళ్ళీ తిరిగి వస్తుంది. రండి, కొంచెం వెనక్కి వెళ్ళి చూద్దాం.

1517 — అమ్మకానికి క్షమాపణ

ఆ రోజుల్లో రోమ్‌లో సెయింట్ పీటర్స్ బసిలికా అనే పెద్ద దేవాలయం కడుతున్నారు. దానికి చాలా డబ్బు కావాలి. అందుకు సంఘ పెద్దలు ఒక దారి కనిపెట్టారు — "ఇండల్జెన్స్" అనే క్షమాపణ పత్రాలు. డబ్బు చెల్లించి ఆ పత్రం కొంటే... మీ పాపాలకు శిక్ష తగ్గుతుంది. చనిపోయిన మీ ఆత్మీయులు కూడా పాపశుద్ధి స్థలము (పర్గేటరీ) నుండి విడుదలవుతారు — ఇదీ వారి బోధ.

"పెట్టెలో నాణెం గణగణ మోగగానే... ఆత్మ పాపశుద్ధి స్థలము నుండి ఎగిరి బయటపడుతుంది" — జొహాన్ టెట్జెల్ అనే బోధకుడు ఊరూరా తిరిగి ఇలా ప్రచారం చేసేవాడని చరిత్ర చెబుతుంది. క్షమాపణ... అంగడి సరుకైపోయింది.

ఇదంతా చూసి లూథర్ హృదయం మండిపోయింది. ఎందుకంటే అతడు స్వయంగా ఆ దారిలో నడిచి అలసిపోయినవాడు. సన్యాసిగా గంటల తరబడి పాపాలు ఒప్పుకున్నాడు. ఉపవాసాలు చేశాడు. ఒంటిని కష్టపెట్టుకున్నాడు. అయినా మనస్సుకు శాంతి లేదు. "దేవుని నీతి" అనే మాట వింటేనే వణికిపోయేవాడు — అది పాపిని శిక్షించే నీతి అనుకున్నాడు.

అప్పుడు రోమా పత్రిక చదువుతుండగా ఈ వాక్యం అతని కళ్ళు తెరిచింది:

> *"ఎందుకనిన నీతిమంతుడు విశ్వాసమూలముగా జీవించునని వ్రాయబడిన ప్రకారము విశ్వాసమూలముగా అంత కంతకు విశ్వాసము కలుగునట్లు దేవుని నీతి దానియందు బయలుపరచబడుచున్నది."*
>
> (రోమా 1:17)

పాపిని శిక్షించవలసిన ఆ నీతిని... క్రీస్తు సిలువలో తామే భరించి, మనకు తమ నీతిని ఉచితంగా ఇస్తున్నారు. దాన్ని డబ్బుతో కొనలేం, క్రియలతో సంపాదించలేం... విశ్వాసంతో స్వీకరిస్తాం అంతే! ఆ క్షణం "పరదైసు తలుపులు తెరచుకుని నేను లోపలికి ప్రవేశించినట్లు అనిపించింది" అని లూథర్ తర్వాత రాసుకున్నాడు.

ఆ వెలుగే అతన్ని ఆ చర్చి తలుపు దగ్గరకు నడిపించింది. కొన్నేళ్లకే (1522) అతడు క్రొత్త నిబంధనను సామాన్య ప్రజల భాష అయిన జర్మన్‌లోకి అనువదించాడు. మొట్టమొదటిసారి ఒక రైతు కూడా దేవుని వాక్యాన్ని తన సొంత భాషలో చదవగలిగాడు.

దేవుని వాక్యం సామాన్యుని చేతికి వచ్చింది. సంస్కరణకు అసలు బలం అదే.

సంస్కరణ తిరిగి తెచ్చినవి

సంస్కరణ కొత్త మతాన్ని కనిపెట్టలేదు. మరుగున పడిపోయిన పాత సత్యాలను మళ్ళీ వెలికి తీసింది. ముఖ్యంగా రెండు సత్యాలను.

మొదటిది: మనుష్యుల సంప్రదాయం కాదు, దేవుని వాక్యమే అంతిమ అధికారం.

లూథర్ కాలంలో పోపు మాట, సంఘ సభల తీర్మానాలు, శతాబ్దాల ఆచారాలు... బైబిలుతో సమానంగా, కొన్నిసార్లు బైబిలు కంటే పైగా కూర్చున్నాయి. యేసుప్రభువు తన కాలపు మత పెద్దలను సరిగ్గా ఇదే విషయంలో గద్దించారు:

> *"మీరు నియమించిన మీ పారంపర్యాచారమువలన దేవుని వాక్యమును నిరర్థకము చేయుదురు."*
>
> (మార్కు 7:13)

ఆచారం మంచిదే కావచ్చు. కానీ అది వాక్యం స్థానాన్ని ఆక్రమించిన రోజు... దేవుని వాక్యాన్నే నిరర్థకం చేస్తుంది.

రెండవది: రక్షణ కొనుక్కునేది కాదు, సంపాదించుకునేది కాదు — కృపచేత ఉచితంగా పొందేది.

> *"మీరు విశ్వాసముద్వారా కృపచేతనే రక్షింపబడియున్నారు; ఇది మీవలన కలిగినది కాదు, దేవుని వరమే. అది క్రియలవలన కలిగినదికాదు గనుక ఎవడును అతిశయపడ వీలులేదు."*
>
> (ఎఫెసీ 2:8,9)

వరం అంటే బహుమానం. బహుమానానికి ధర కట్టలేం. టెట్జెల్ పెట్టెలో నాణెం వేసినవాడికీ, చేతిలో పైసా లేని పేదవాడికీ... సిలువ దగ్గర ఒకటే ధర — ఉచితం!

ఈ రెండు సత్యాల చుట్టూ సంస్కర్తలు ఐదు "మాత్రమే"లను నిలబెట్టారు: లేఖనము మాత్రమే, విశ్వాసము మాత్రమే, కృప మాత్రమే, క్రీస్తు మాత్రమే, దేవునికే మహిమ.

ఐదు శతాబ్దాలుగా ప్రొటెస్టెంట్ సంఘం ఈ పునాది మీదే నిలబడుతోంది. కానీ ఇక్కడే ఒక ఇబ్బందికరమైన ప్రశ్న... పునాది మీద నిలబడిన మనం, ఆ పునాదినే మరచిపోతున్నామా?

ప్రియులారా, దేవుడు ఈ సంస్కరణ దినాన మనకు ఒక్క మాట చెబుతున్నారు: **తిరిగి వాక్యానికి రండి!** అయితే ముందు... మనం ఎక్కడ దారి తప్పామో చూద్దాం.

1517 మళ్ళీ వస్తోందా?

ఇప్పుడు అద్దంలో మనల్ని మనం చూసుకుందాం. లూథర్ కాలపు జబ్బులు కొన్ని... నేడు కొత్త బట్టలు వేసుకుని మన మధ్యనే తిరుగుతున్నాయి. ప్రతి జబ్బుకూ ఒక మందు ఉంది. కృపచేత రక్షింపబడిన మనం... ఈ వారమే మొదలుపెట్టవచ్చు.

1. చేతిలో వాక్యం... హృదయంలో లేదు

అప్పుడు బైబిలు లాటిన్ భాషలో ఉండేది; సామాన్యుడు చదవలేకపోయాడు. నేడు తెలుగు బైబిలు ప్రతి ఇంట్లో ఉంది. ప్రతి ఫోన్‌లో ఉంది. అయినా చదివేవారు ఎంతమంది? ఆదివారం చర్చికి తీసుకువెళ్ళి, మళ్ళీ వచ్చే ఆదివారం వరకు అలమరలో పెట్టే బైబిళ్ళు ఎన్నో! వారమంతా దాని మీద దుమ్ము మాత్రం క్రమం తప్పకుండా చేరుతుంది — మనకంటే నమ్మకంగా! లూథర్ కాలంలో ప్రజలను బైబిలు చదవనివ్వలేదు. మనం చదవగలిగి కూడా చదవడం లేదు. వారిది అజ్ఞానం; మనది నిర్లక్ష్యం.

> *"నా జనులు జ్ఞానములేనివారై నశించుచున్నారు."*
>
> (హోషేయ 4:6)

ఈ వారం: రోజుకు ఒక అధ్యాయమైనా సరే, చదవండి. ఉదయం లేవగానే... గుడ్ మార్నింగ్ మెసేజ్‌ల కంటే ముందు బైబిలు!

2. వాక్యం కంటే "ప్రత్యక్షత" పైన

అప్పుడు పోపు శాసనాలు బైబిలుకు పైగా కూర్చున్నాయి. నేడు "దేవుడు నాకు కలలో చెప్పారు", "ప్రభువు నాతో మాట్లాడారు" అనే మాటలు... వాక్యం కంటే ఎక్కువ బరువు మోస్తున్నాయి. మరికొన్ని సంఘాల్లో "మా పెద్దల కాలం నుండి ఇలాగే జరుగుతోంది" అనే ఆచారమే అంతిమ

మాట. కానీ ఏ కల అయినా, ఏ దర్శనమైనా, ఏ ఆచారమైనా... వాక్యం అనే త్రాసులో తూచి చూడాలి. దేవుడు ఈనాటికీ మాట్లాడతారు — కానీ వ్రాయబడిన వాక్యం ద్వారానే. వాక్యానికి సరిపోకపోతే... అది ఎంత గొప్పగా వినిపించినా పక్కన పెట్టాల్సిందే. మార్కు 7:13లో యేసుప్రభువు గద్దించిన పాపం ఇదే. బైబిలు చేతిలో పెట్టుకుని 'దేవుని మాట' కోసం ప్రవక్తల చుట్టూ తిరగడం... **చంకలో పిల్లాడిని పెట్టుకుని ఊరంతా వెతికినట్టే!**

బెరయ పట్టణపు విశ్వాసులు అపొస్తలుడైన పౌలు బోధను కూడా ఇలాగే పరీక్షించారు:

> *"...పౌలును సీలయును చెప్పిన సంగతులు ఆలాగున్నవో లేవో అని ప్రతిదినమును లేఖనములు పరిశోధించుచు వచ్చిరి."*
>
> (అపొస్తలుల కార్యములు 17:11)

పౌలు మాటనే పరీక్షించినప్పుడు... మన కాలపు ఏ బోధకుడూ ఆ పరీక్షకు అతీతుడు కాడు — ఈ వ్యాసం వ్రాస్తున్న నాతో సహా.

ఈ వారం: మీరు వినే ప్రతి బోధను... బైబిలు తెరిచి సరిచూడండి.

3. దైవజనుడే మధ్యవర్తా?

అప్పుడు సామాన్యుడు దేవుని దగ్గరకు నేరుగా వెళ్ళలేడు, యాజకుని ద్వారానే వెళ్ళాలి అని బోధించారు. నేడు "అన్నగారు ప్రార్థిస్తేనే పని అవుతుంది", "ఆ దైవజనుడు చెయ్యి పెడితేనే స్వస్థత" అనే నమ్మకం విస్తరిస్తోంది. దైవజనుని పేరు చుట్టూ ఒక కొత్త యాజకత్వం పుట్టుకొస్తోంది. కానీ వాక్యం స్పష్టంగా చెబుతోంది:

> *"దేవుడొక్కడే, దేవునికిని నరులకును మధ్యవర్తియు ఒక్కడే; ఆయన క్రీస్తుయేసను నరుడు."*
>
> (1 తిమోతి 2:5)

విశ్వాసులందరినీ వాక్యం యాజకులుగా పిలుస్తోంది (1 పేతురు 2:9). దైవజనుని ప్రార్థన విలువైనదే. కానీ మీకూ, మీ పరలోకపు తండ్రికీ మధ్య... యేసుక్రీస్తు తప్ప మరెవరూ అవసరం

లేదు.

ఈ వారం: మీ అవసరాన్ని మీరే... యేసు నామంలో నేరుగా తండ్రికి చెప్పండి. మీ ప్రార్థనకు ఏ మధ్యవర్తి సంతకమూ అక్కర లేదు.

4. శిక్షణ లేని కాపరులు

లూథర్ కాలంలో చాలామంది యాజకులు సరిగా చదవలేనివారు; లేఖనాలు తెలియకుండానే బలిపీఠం ఎక్కారు. నేడూ అదే కథ. మన ఊళ్ళలో కొత్త సంఘాల బోర్డులు... టీ కొట్ల కంటే వేగంగా వెలుస్తున్నాయి. "ఒక రాత్రి కల వచ్చింది... మరుసటి వారం సంఘం మొదలుపెట్టాను." పిలుపు నిజమైనదే కావచ్చు. కానీ పిలువబడినవాడు సిద్ధపడాలి కూడా. ఈ మాట మొదట నాకు, ఒక పాస్టరుకే వర్తిస్తుంది. సంఘ పెద్దను గురించి పౌలు ఇలా హెచ్చరించాడు:

> *"అతడు గర్వాంధుడై అపవాదికి కలిగిన శిక్షావిధికి లోబడకుండునట్లు క్రొత్తగా చేరినవాడై యుండకూడదు."*
>
> (1 తిమోతి 3:6)

తప్పుడు బోధ చాలాసార్లు దుర్బుద్ధి వల్ల కాదు... తెలియకపోవడం వల్ల పుడుతుంది. వాక్యాన్ని సరిగా విభజించడం నేర్చుకోని కాపరి... తన మందను తెలియకుండానే తప్పు దారిలో నడిపిస్తాడు.

ఈ వారం: సంఘస్థులారా — మీ కాపరి కోసం ప్రార్థించండి; నేర్చుకోవడానికి సమయమివ్వండి, ప్రోత్సహించండి. పరిచర్యకు పిలువబడిన యువకులారా — తొందరపడకండి. వాక్యం నేర్చుకోండి, సిద్ధపడండి.

ఇవన్నీ లూథర్ కాలపు జబ్బులే. పేర్లు మారాయి... రోగం మారలేదు. ఔషధం కూడా మారలేదు — అదే వాక్యం.

సంస్కరింపబడిన సంఘం... సంస్కరింపబడుతూనే ఉండాలి

సంస్కరణ 1517లో ముగిసిపోయిన సంఘటన కాదు. ప్రతి తరంలో, ప్రతి సంఘంలో... ముఖ్యంగా ప్రతి హృదయంలో జరగాల్సిన పని. లూథర్ కూడా మొదట తన సొంత హృదయంతోనే మొదలుపెట్టాడు. దానికి కొలబద్ద ఒక్కటే:

> *"దైవజనుడు సన్నద్ధుడై ప్రతి సత్కార్యమునకు పూర్ణముగా సిద్ధపడి యుండునట్లు దైవావేశమువలన కలిగిన ప్రతి లేఖనము ఉపదేశించుటకును, ఖండించుటకును, తప్పు దిద్దుటకును, నీతియందు శిక్షచేయుటకును ప్రయోజనకరమై యున్నది."*
>
> (2 తిమోతి 3:16,17)

ఆ వాక్యమే నిన్న లూథర్‌ను మార్చింది. ఈ రోజు మనల్నీ మార్చగలదు.

మీరు ఎక్కడ నిలబడ్డారు?

1521. వార్మ్స్ నగరం. చక్రవర్తి ఎదుట, సంఘ పెద్దల ఎదుట లూథర్ నిలబడ్డాడు. "నీ రచనలన్నీ వెనక్కి తీసుకో" — ఇదీ వారి ఆజ్ఞ. ప్రాణం ప్రమాదంలో ఉంది.

అప్పుడు అతడు ఇచ్చిన జవాబు చరిత్రలో నిలిచిపోయింది: "లేఖనాల ద్వారా నన్ను ఒప్పించనంత వరకు... నేను దేనినీ వెనక్కి తీసుకోను. నా మనస్సాక్షి దేవుని వాక్యానికి బందీ." ఆ తర్వాత "నేను ఇక్కడ నిలబడ్డాను; మరొకటి చేయలేను. దేవా, నాకు సహాయము చేయుము" అని కూడా అన్నాడని చరిత్ర చెబుతుంది.

ఒక్క మనిషి... ఒక్క పుస్తకం మీద నిలబడ్డాడు. ఆ నిలకడ ప్రపంచాన్నే మార్చింది.

1517లో విట్టెన్‌బర్గ్ చర్చి తలుపు మీద ఒక మేకు మోగింది. ఈ రోజు ఆ శబ్దం మన సంఘాల తలుపు తడుతోంది: వాక్యం చదవండి. ప్రతి స్వరాన్ని పరీక్షించండి. క్రీస్తు ద్వారా నేరుగా రండి. పిలుపును, శిక్షణను గౌరవించండి.

ఈ సంస్కరణ దినాన ప్రశ్న లూథర్‌ది కాదు... మనది.

మీరు ఎక్కడ నిలబడ్డారు? ఆచారం మీదా? ఒక మనిషి మాట మీదా? లేక... దేవుని వాక్యం మీదా?

వాక్యం మీద నిలబడటం అంటే... వాక్యం చూపించే క్రీస్తు మీద నిలబడటమే.



Pastor John Prabhu Kiran,
Senior Pastor - IBM Church,
Professor of Theology - Andhra Bible College

andhrabiblecollege.in/read/vakyaniki-bandi